# విస్తరణ పూర్తిచేసుకున్న వీసీటీపీఎల్

- కొవిడ్‌తో 50శాతం పెరిగిన నిర్మాణ వ్యయం
- రూ.950 కోట్లతో పనుల పూర్తి
- 12.4 లక్షల టీఈయూలకు చేరిన సామర్థ్యం



వీసీటీపీఎల్‌లో నూతనంగా నిర్మించిన బెర్త్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం పోర్టులో ఆధునికీకరించిన కంటెయినర్ టెర్మినల్ అందుబాటులోకి వచ్చింది. గతంలో ఏడాదికి 7 లక్షల టీఈయూ(కంటెయినర్లు)ను హ్యాండిల్ చేసిన ఈ టెర్మినల్ ఇప్పుడు అదనంగా మరో 5.4 లక్షల టీఈయూల హ్యాండ్లింగ్ సామర్థ్యాన్ని సమకూర్చుకుంది. పదేళ్ల క్రితం విస్తరణ పనులు ప్రతిపాదించినప్పుడు అంచనా వ్యయం రూ.633.11 కోట్లు కాగా పూర్తిస్థాయి అనుమతులు రావడంలో జాప్యం, కరోనా వల్ల ఖర్చు 50 శాతం పెరిగి రూ.950 కోట్లకు చేరింది. ఇప్పుడు తూర్పుతీరంలో కంటెయినర్ కార్గో రవాణాకు ముఖ్య కేంద్రంగా మారింది.



ఆధునీకరించిన కంటెయినర్ టెర్మినల్

## ముందుచూపుతో విస్తరణ

విశాఖపట్నం పోర్టు నౌకల ద్వారా బల్క్ కార్గోను హ్యాండిల్ చేస్తుండగా, కంటెయినర్ల ద్వారా సరకు రవాణాకు డిమాండ్ పెరగడంతో ముందుచూపుతో పోర్టుకు అనుబంధంగా వున్న 'విశాఖ కంటెయినర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ (వీసీటీపీఎల్)'ను విస్తరించాలని 2012లో నిర్ణయించింది. రూ.633.11 కోట్ల అంచనా వ్యయంతో గ్లోబల్ టెండర్లు పిలవగా జీఆర్ఎస్ సంస్థ 11.04 శాతం తక్కువకు పని చేయడానికి కాంట్రాక్ట్ దక్కించుకుంది. దీనిపై 2014లో ఇరు సంస్థల మధ్య ఒప్పందం జరిగింది. పర్యావరణం, కోస్తా నియంత్రణ మండలి నుంచి మార్చి, 2019లో అనుమతులు వచ్చాయి. అక్కడి నుంచి ప్రాజెక్టు పూర్తిచేయడానికి రెండేళ్ల గడువు ఇచ్చారు. అదే ఏడాది కరోనా రావడంతో నిర్మాణ పనులకు కూలీల సమస్య తలెత్తింది.



కంటెయినర్ టెర్మినల్‌లో భారీ క్రేన్లు

దాంతో మరో 12 నెలలు గడువు పెంచారు. ఎట్టకేలకు పనులన్నీ పూర్తి చేసుకొని అధునాతన టెర్మినల్ అందుబాటులోకి వచ్చింది. అయితే నిర్మాణ వ్యయం మాత్రం 50 శాతం పెరిగిపోయి రూ.950 కోట్లకు చేరింది. విస్తరించిన టెర్మినల్ పైకి దుబాయ్ నుంచి పీఆర్ఎస్ఎస్ కాయా షిప్ రాగా విజయవంతంగా కంటెయినర్లను దిగుమతి చేశారు. అటు నుంచి 1,500 కంటెయినర్లు రాగా ఇటు నుంచి 1,400 కంటెయినర్లను ఎగుమతి చేశారు.

## మొత్తం పొడవు 850 మీటర్లు

కంటెయినర్ టెర్మినల్ మొదట 450 మీటర్ల పొడవు ఉండగా, దానిని విస్తరణలో భాగంగా మరో 400 మీటర్లు నిర్మించారు. మొత్తం 850 మీటర్ల పొడవు వుండడంతో ఇప్పుడు భారీ పానామ్యాక్స్ షిప్‌లు రావడానికి మార్గం సుగమమైంది. ఇంతకు ముందు లక్ష డబ్ల్యూటీ లోపు చిన్న షిప్‌లు మాత్రమే వచ్చేవి. ఇప్పుడు 2 లక్షల డబ్ల్యూటీ సామర్థ్యం కలిగిన భారీ నౌకలు రాగలుగుతున్నాయి. ఈ టెర్మినల్‌పై ఇప్పుడు ఒకేసారి మూడు నౌకలు (భారీ, మధ్య తరహా, చిన్న) నౌకలు నిలుపుకొనే సౌకర్యం కలిగింది. ఇందుకు అనుగుణంగా 3 మేజర్ క్రేన్లు, మీడియం సైజ్ క్రేన్లు 9, చిన్న క్రేన్లు మరో మూడు కొనుగోలు చేశారు. గతంలో డీజిల్‌తో నడిచే క్రేన్లు ఉండగా, ఇప్పుడు ఎలక్ట్రికల్ క్రేన్లు సమకూర్చుకున్నారు. పెద్దఎత్తున వచ్చే కంటెయినర్ల కోసం 20 ఎకరాల్లో బ్యాకప్ ఏరియా ఏర్పాటు చేశారు. ఇందులో పది వేల కంటెయినర్లను నిల్వ చేసుకోవచ్చు. అది కాకుండా మరో 50 ఎకరాల్లో స్టాక్‌యార్డ్ ఏర్పాటు చేశారు.

### కంటెయినర్ హబ్‌గా అభివృద్ధి

- కె.రామమోహన్‌రావు, పోర్టు చైర్మన్



విశాఖపట్నం కంటెయినర్ హబ్‌గాను అభివృద్ధి చెందుతుంది. ఆ అవసరాలకు తగినట్టుగానే కంటెయినర్ టెర్మినల్ ఆదునీకరించాం. ప్రస్తుతం పానామ్యాక్స్ నౌకలు వస్తున్నాయి. క్రమంగా కంటెయినర్లు పెరుగుతున్నాయి. ఇప్పుడు పోటీగా ప్రైవేటు పోర్టు కూడా కంటెయినర్ టెర్మినల్ నిర్మాణానికి నడుం కట్టింది.

# అండమాన్‌కు చలో చలో



పోర్టుబ్లెయిర్‌లో బయలుదేరిన క్యాంప్‌బెల్ షిప్

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం నుంచి పోర్టు బ్లెయిర్‌కు తొలినాళ్లలో మూడు నెలలకోసారి పాసింజర్ షిప్ నడిచేది. క్రమంగా డిమాండ్ పెరగడంతో నెలకోసారి పరుగులు తీసింది. విశాఖ పోర్టు నుంచి ఉత్తరాంధ్రతో పాటు ఇతర జిల్లాల నుంచి ప్రయాణికులు, ముఖ్యంగా వలసదారులు ఈ నౌక ద్వారానే అండమాన్ చేరుకునేవారు. ఫుల్ డిమాండ్‌తో నడుస్తున్న తరుణంలో కరోనా వ్యాప్తి చెందడం... లాక్‌డౌన్ కారణంగా.. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రెండేళ్ల పాటు రాకపోకలను నిలిపివేసింది. తాజాగా పరిస్థితులు సద్దుమణిగిన నేపథ్యంలో ఫుల్ స్వింగ్‌లో షిప్ ప్రయాణం మొదలుపెట్టింది.

**శనివారం సాయంత్రం బయలుదేరి..**

450 మంది ప్రయాణికులతో శనివారం సాయంత్రం పోర్టుబ్లెయిర్‌లో పాసింజర్ కార్గో షిప్ క్యాంప్‌బెల్ బే బయలుదేరింది. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వారే 95 శాతం మంది ఇందులో ఉండటం విశేషం. అండమాన్ నికోబార్‌లో వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న వారంతా.. వేసవి సెలవుల కోసం తమ స్వస్థలాలకు బయలుదేరినట్లు షిప్ ఏజెంట్స్ చెబుతున్నారు. మూడు రోజుల ప్రయాణం తర్వాత విశాఖపట్నం పోర్టుకు ఈ నెల 3వ తేదీ ఉదయం చేరుకోనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ట్రాఫిక్ మేనేజర్ రత్నకుమార్ పూర్తి చేశారు.

**5న ఫుల్‌ప్యాక్‌తో ప్రయాణం**

విశాఖ నుంచి తిరుగు ప్రయాణం కూడా ఖరారైంది. ఈ నెల 5వ తేదీ సాయంత్రం క్యాంప్‌బెల్ బే షిప్ విశాఖ నుంచి బయలుదేరనుంది. 8వ తేదీ ఉదయానికి క్యాంప్‌బెల్ బే.. తిరిగి పోర్టు బ్లెయిర్‌కు చేరుకోనుంది. సుదీర్ఘ విరామం తర్వాత నడుస్తుండటంతో టికెట్స్ హాట్ కేక్స్‌లా అమ్ముడు పోయాయి. మొత్తం 500 మంది సామర్థ్యం ఉండగా బుకింగ్స్ ప్రారంభించిన రెండ్రోజుల్లోనే మొత్తం టికెట్స్ విక్రయించేశారు. అండమాన్ నికోబార్ అడ్మినిస్ట్రేషన్ మార్గదర్శకాలను అనుసరించి క్యాంప్‌బెల్‌షిప్‌ని నడుపుతున్నట్లు షిప్పింగ్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఏవీ భానోజీరావు, గరుడ పట్టాభి రామయ్య అండ్ కో ఏజెన్సీ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.

**డిమాండ్ నేపథ్యంలో మరో షిప్ రెడీ..!**

క్యాంప్‌బెల్ బే ప్యాసింజర్ కార్గో షిప్ తొలి ప్రయాణంలోనే 100 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేయడంతో షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. టికెట్స్ ఇంకా కావాలంటూ ప్రజల నుంచి ఒత్తిడి వస్తుండటంతో మరో షిప్‌ని కూడా నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో విశాఖ నుంచి పోర్టుబ్లెయిర్‌కు ఎంవీ స్వరాజ్‌ద్వీప్ నౌక రాకపోకలు సాగించేది. తర్వాత ఎంవీ హర్షవర్ధన్ నడిపారు. రెండేళ్ల క్రితం ఇది మరమ్మతులకు గురికావడంతో డాక్‌యార్డులో మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఇది దాదాపు పూర్తయిందనీ.. త్వరలోనే ఎంవీ హర్షవర్ధన్ షిప్‌ని విశాఖ నుంచి పోర్టు బ్లెయిర్‌కు రాకపోకలు సాగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

**ప్రయాణం చాలా చౌక**

అండమాన్‌కు చాలా తక్కువ ధరకే ప్రయాణం చేయవచ్చు. అయితే ప్రయాణికులను రెండు రకాలుగా విభజించారు. అండమాన్ ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రయాణికుడిని ఐలాండర్ అనీ.. పర్యాటకుల్ని నాన్ ఐలాండర్‌గా షిప్ టికెట్స్ విక్రయంలో విభజిస్తారు. ఐలాండర్‌కు జనరల్ టికెట్ కేవలం రూ.1250 మాత్రమే కాగా.. పర్యాటకుడికి జనరల్ టికెట్ రూ.3,375 వసూలు చేస్తున్నారు. విశాఖ నుంచి అండమాన్‌కు విమానంలో వెళ్లాలంటే రూ.10 వేల వరకూ ఖర్చవుతుంది. ఎంత లగేజ్ తీసుకెళ్లినా.. ఎలాంటి అదనపు చార్జీ వసూలు చేయడం లేదు. మొత్తం నాలుగు విభాగాలుగా టికెట్స్ విక్రయాలు జరుపుతున్నట్లు షిప్పింగ్ కార్పొరేషన్ ప్రతినిధులు తెలిపారు.

## మంచి ప్రారంభం దక్కింది



కోవిడ్ తర్వాత అండమాన్‌కు పాసింజర్ షిప్ ప్రయాణం మొదలు కావడం సంతోషంగా ఉంది. గతంలో మాదిరిగానే ప్రారంభం నుంచే ప్రయాణికులు ఆసక్తి చూపించడం శుభపరిణామం. ఈ నెల 3న వస్తున్న షిప్‌కు బెర్తు, ఇతర సౌకర్యాలు పోర్టు పరంగా పూర్తి చేశాం. ప్రతి ప్రయాణికుడు కనీసం 10–15 పెద్ద సైజు బ్యాగ్‌లు, లగేజీతో ప్రయాణిస్తుంటారు. ఇందుకనుగుణంగా పోర్టులోకి ఆర్టీసీ బస్సులను కూడా ఆ సమయంలో అనుమతిస్తున్నాం.

– కె.రామ్మోహన్‌రావు, విశాఖ పోర్టు చైర్మన్

# అండమాన్‌కు చలో చలో



పోర్టుబ్లెయిర్‌లో బయలుదేరిన క్యాంప్‌బెల్ షిప్

**టికెట్ ధరలు ఇలా..? (రూపాయల్లో)**

| బంకిలో(జనరల్).. | | సెకండ్ క్లాస్‌లో.. | | ఫస్ట్ క్లాస్‌లో.. | | డీలక్స్‌లో.. | |
|---|---|---|---|---|---|---|---|
| ఐలాండర్ | 1,250 | ఐలాండర్ | 4,600 | ఐలాండర్ | 6,115 | ఐలాండర్ | 6,775 |
| నాన్ ఐలాండర్ | 3,375 | నాన్ ఐలాండర్ | 8,625 | నాన్ ఐలాండర్ | 10,850 | నాన్ ఐలాండర్ | 13,075 |

సుదీర్ఘ విరామం తర్వాత.. అందమైన దీవులకు సాగరంలో పయనించే అవకాశం కలుగుతోంది. కోవిడ్ తర్వాత విశాఖపట్నం– పోర్టుబ్లెయిర్ పాసింజర్ నౌక రాకపోకలు ప్రారంభించింది. అండమాన్‌లో శనివారం సాయంత్రం 450 మంది ప్రయాణికులతో విశాఖపట్నం బయలుదేరింది. విశాఖ నుంచి ఈ నెల 5న తిరిగి ప్రయాణం కానున్న షిప్‌కు గిరాకీ పెరిగింది. చాలా కాలం తర్వాత ప్రయాణిస్తున్న నేపథ్యంలో టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో మరో నౌకను నడిపేందుకు షిప్పింగ్ కార్పొరేషన్ సన్నాహాలు చేస్తోంది.

– సాక్షి, విశాఖపట్నం

- 5న విశాఖ నుంచి అండమాన్‌కు క్యాంప్‌బెల్ నౌక
- నౌక సామర్థ్యం 500
- హాట్‌కేకుల్లా అమ్ముడుపోయిన టికెట్లు
- డిమాండ్ దృష్ట్యా హర్షవర్ధన్ షిప్ కూడా సిద్ధం
- అండమాన్ నుంచి శనివారం సాయంత్రం బయలుదేరిన షిప్

- 2ల

# ముగిసిన 43వ అఖిల భారత మేజర్ పోర్ట్స్ అథ్లెటిక్ మీట్

ప్రభాతవార్త, విశాఖపట్నం



మూడు రోజులుగా నగరంలోని పోర్ట్ స్టేడియంలో జరుగుతున్న 43వ అఖిలభారత మేజర్ పోర్ట్స్ అథ్లెటిక్ మీట్ 2021-22 పోటీలు ఆదివారంతో ముగిశాయి. 7 మేజర్ పోర్టులకు సంబంధించిన క్రీడాకారులు 119 మంది ఈ పోటీల్లు పాల్గొని సత్తా చాటారు. మొత్తం 63 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. పురుషుల విభాగంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ విజేతలుగా నిలవగా పారాదీప్ పోర్టు అధారిటీ రన్నర్‌గా నిలిచింది. మహిళల విభాగంలో పరదీప్ పోర్టు అధారిటీ విజేతగాను, విశాఖపట్నం పోర్టు అధారిటీ రన్నర్‌గా నిలిచింది. వ్యక్తిగత విభాగంలో విశాఖపట్నం పోర్టు అధారిటీకి చెందిన నాగరాజు 40 పాయింట్లు సాధించగా మహిళల విభాగంలో దీన్ దయాల్ పోర్టుకు చెందిన దీక్షిత రాజ్ పురోహిత్ 38 పాయింట్లు సాధించి విజేతగా నిలిచింది. విశాఖపట్నం పోర్టు అధారిటీ 414 పాయింట్లతో ఓవరాల్ చాంఫియన్‌గా నిలిచింది. ఇందులో 21 స్వర్ణ పతకాలు, 21 వెండి పతకాలు, 18 కాంస్య పతకాలు ఉన్నాయి. మేజర్ పోర్ట్స్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమాన్ని పోర్టు అవుట్ డోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పోర్టు చైర్మన్ రామమోహనరావు హాజరయ్యారు. గెలుపొందిన విజేతలకు చైర్మన్ చేతుల మీదుగా బహుమతులు అందించారు.

# అథ్లెటిక్ చాంప్స్ వీపీఏ, పీపీఏ

విశాఖ స్పోర్ట్స్: అఖిల భారత మేజర్ పోర్ట్స్ అథ్లెటిక్ మీట్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను మెన్‌లో విశాఖ పోర్ట్ అథారిటీ, వుమెన్‌లో పారదీప్ పోర్ట్ అథారిటీ సాధించాయి. మెన్‌లో పారాదీప్ పోర్ట్ అథారిటి(పీపీఏ) రన్నరప్‌గా నిలవగా.. మహిళా విభాగంలో విశాఖ పోర్ట్ అథారిటీ(వీపీఏ) నిలిచింది. వ్యక్తిగత విభాగం మెన్‌లో పి.నాగరాజు(వీపీఏ) 40 పాయింట్లతో, మహిళల్లో దీక్షిత(దీన్‌దయాళ్ పోర్ట్) 38 పాయింట్లతో చాంపియన్స్‌గా నిలిచారు. ఏడు మేజర్ పోర్ట్‌లకు చెందిన 119 మంది అథ్లెట్లు, వెటరన్ అథ్లెట్లు, సీనియర్ అథ్లెట్లు.. పోర్ట్ స్టేడియంలో జరిగిన ట్రాక్, ఫీల్డ్ అంశాల్లో పాల్గొన్నారు. ఆదివారంతో ముగిసిన ఈ మీట్‌లో వీపీటీ చైర్మన్ రామ్మోహనరావు విజేతలకు ట్రోఫీలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని.. ఆటల వల్ల ఒత్తిడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్, కార్యదర్శి వేణుగోపాల్, విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంప్ వీపీఏ

# ముగిసిన ఆలిండియా మేజర్ పోర్ట్సు అథ్లెటిక్స్ మీట్

▸▸ ఓవరాల్ చాంప్ ఆతిథ్య విశాఖ పోర్టు అథారిటీ




విజేత జట్టు సభ్యులకు ట్రోఫీని అందిస్తున్న దృశ్యం

**విశాఖపట్నం (స్పోర్ట్సు), మే 1:** విశాఖపట్నం పోర్టు స్పోర్ట్సు కౌన్సిల్ నిర్వహించిన 43వ అఖిల భారత మేజర్ పోర్ట్సు అథ్లెటిక్స్ మీట్‌లో ఆతిథ్య విశాపట్నం పోర్టు అథారిటీ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. పోర్టు అథ్లెట్లు అద్భుత ప్రతిభతో 21 స్వర్ణ, 21 రజత, 18 కాంస్య పతకాలతో 414 పాయింట్లు సాధించి టైటిల్ సొంతం చేసుకున్నారు. జట్టు వారీగా పురుషుల విభాగంలో విశాఖ పోర్టు, పారదీప్ పోర్టు విన్నర్, రన్నరప్‌గా కాగా మహిళల విభాగంలో పారదీప్ పోర్టు, విశాఖ పోర్టు విన్నర్ రన్నరప్‌గా నిలిచాయి. వ్యక్తిగత పురుషుల విభాగంలో విశాఖ పోర్టు అథ్లెట్ పి.నాగరాజు (5 స్వర్ణ, ఒక రజత పతకం), మహిళల విభాగంలో పారదీప్ పోర్టు అథ్లెట్ దీక్షా రాజపురోహిత్ (4 స్వర్ణ, ఒక రజత పతకం) చాంపియన్స్ అవార్డులు అందుకున్నారు. ఇక సూపర్ సీనియర్స్ 45 ప్లస్ పురుషుల విభాగంలో విశాఖ పోర్టు, ముంబయి పోర్టు; మహిళల కేటగిరిలో జవహర్‌లాల్ నెహ్రూ, పారదీప్ పోర్టు; 50 ప్లస్ పురుషుల విభాగంలో విశాఖ పోర్టు, పారదీప్ పోర్టు; మహిళల కేటగిరిలో చైన్నై పోర్టు, జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు విన్నర్, రన్నరప్ స్థానాలను దక్కించుకున్నాయి. పోర్టుస్టేడియంలో ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి పోర్టు చైర్మన్ కె.రామ్మోహనరావు ముఖ్య అతిథిగా హాజరై ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజులపాటు జరిగే ఈ మీట్‌లో ఏడు ప్రధాన పోర్టుల నుంచి 119 మంది అథ్లెట్లు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే, సీవీవో జె.ప్రదీప్‌కుమార్, కార్యదర్శి టి.వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.